ప్రజాశక్తి
సోమవారం 16 జూన్ 2025 5 శ్రీ సత్యసాయి

మేమేమి పాపం చేశాం...

చాలీచాలని వేతనంతో వెట్టిచాకిరీ....
తల్లికి వందనమేకాదు...సంక్షేమ పథకాలన్నీ ఇవ్వాలి ..
అంగన్‌వాడీల విన్నపం
23న కలెక్టరేట్ ఎదుట ధర్నా

మేమేమి పాపంచేశాం... చాలీచాలని వేతనంతో వెట్టిచాకిరీ చేస్తున్నా ప్రభుత్వాలు గుర్తించవా... అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణే కాదు ప్రభుత్వ కార్యక్రమాల్లోను భాగస్వాములుగా బాధ్యతలు పెడుతున్నారు. తల్లికి వందనమేకాదు...ప్రభుత్వం అర్హులకు అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాలను మాకు వర్తింపచేయాలి. దిన కూలీలతో సమానమైన కనీసవేతనం కూడా మాకు లేనప్పుడు సంక్షేమ పథకాలకు ఎందుకు అనర్హులవుతాం.? ఇవీ ప్రతి అంగన్‌వాడీ కార్యకర్తల మనస్సులోని ఆవేదన. అంగన్వాడీల విషయంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈనెల 23వ తేదీన జిల్లా కలెక్టరేట్ వద్ద వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నాకు పిలుపునిచ్చారు.

ప్రజాశక్తి - కళ్యాణదుర్గం టౌన్

అంగన్‌వాడీల ఆవేదన...

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల ఆవేదన అంతాఇంతా కాదు. వారు నిత్యం తమ వృత్తిలో చేస్తున్న వెట్టిచాకిరి తలచుకుంటూ వేదనకు గురవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 23 ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. ఇందులో మెయిన్, మిని అంగన్‌వాడీ కార్యకర్తలు 5126 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరేకాదు మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలలో 4286 మంది హెల్పర్లు కూడా విధులు నిర్వహిస్తున్నారు. వీటిలో ఒకటి అర ఎక్కడైనా ఖాళీ ఉండొచ్చేమోకాని సరాసరి ఈ సంఖ్యలో అంగన్‌వాడీలు, హెల్పర్లు వున్నారు.

అంగన్‌వాడీలు 40 శాతం...హెల్పర్లు 50 శాతం పథకాలు పొందే అవకాశం సంక్షేమ పథకాలు కార్యకర్తలు, హెల్పర్లకు వర్తింపచేస్తే ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 23 ప్రాజెక్టులలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో పనిచేస్తున్న 5126మంది కార్యకర్తల్లో 40 శాతం మంది, హెల్పర్లు 50 శాతం మంది అర్హతపొందే అవకాశముంటుంది. ఉద్యోగవిరమణ వయస్సుకు 8ఏళ్లకు దగ్గరలో వున్నవారి పిల్లలు దాదాపు ఇంటర్మీడియట్ చదువులు పూర్తిచేసుకుని వుంటారు. ఈ లెక్కన అంగన్‌వాడీ కార్యకర్తలు సుమారు 2వేల మంది, హెల్పర్లు మరో 2వేల మంది తల్లికి వందనం అందుకునే అవకాశముంటుంది. ఈ లెక్కన ఆయా కుటుంబాలలో సరాసరి విద్యార్థుల సంఖ్యను కూడా ఒక్కో కుటుంబంలో ఇద్దరు ప్రకారం లెక్కగడితే నాలుగువేల మంది పిల్లలకు తల్లికి వందనం వర్తించే అవకాశముంది. ఇది కాకుండా ఇతరులకు అందుతున్న అన్ని సంక్షేమ పథకాల తరహాలోనే 5126 మంది కార్యకర్తలు, 4286 మంది హెల్పర్లు అందుకునే అవకాశముంటుంది.

అర్హతకు ఆదాయ నిబంధనలు...అంగన్‌వాడీల వేతనాలు పరిశీలిస్తే....సంక్షేమ పథకాల అర్హతకు ప్రభుత్వం విధించిన నిబంధనలు చూస్తే పట్టణ ప్రాంతాల్లో నెలకు ఆదాయం రూ.12వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.10వేలకు మించి వుండకూడదు. విద్యుత్ వినియోగం 300 యూనిట్లు మించకూడదు, పక్కాగృహం వెయ్యి చదరపు అడుగులు మాత్రమే వుండాలి. నిబంధనలు ఆధారంగా అంగన్‌వాడీ వేతనాలు పరిశీలిస్తే మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తకు నెలకు రూ.11,500, మిని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు రూ.7వేలు చొప్పున వేతనం అందుకుంటున్నారు. ఇలాంటి చాలిచాలని వేతనాన్ని అందుకుంటున్న వీరిని ప్రభుత్వ అర్హులుగా ఎందుకు గుర్తించడంలేదనేది ఆయా చిరుద్యోగుల ఆవేదన. దినసరి కూలి కూడా రోజుకు రూ.300ల ప్రకారం నెలకు రూ.9వేలకు పైగానే సంపాదించి మధ్యాహ్నానికి ఇంటికి చేరుకుంటారు.

ఈనెల 23న కలెక్టరేట్ వద్ద ధర్నా... అంగన్‌వాడీ కార్యకర్తలకు, హెల్పర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని ఆయా యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నాకు నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా వున్న కార్యకర్తలు, హెల్పర్లు హాజరై వారి ఆవేదనను కలెక్టర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా నిరసన తెలిపేందుకు సిద్ధమయ్యారు.

ప్రాజెక్టుల సంఖ్య : 23	మెయిన్ కేంద్రాలు : 4286	కార్యకర్తలు : 4286	మొత్తం సంఖ్య : 5126
	మినీ కేంద్రాలు : 840	కార్యకర్తలు : 840	ఆయాల మొత్తం సంఖ్య : 4286

సంక్షేమ పథకాల జీవో ఇవ్వాలి

అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం జీవో విడుదల చేయాలి. గత ప్రభుత్వంలోను హామీ ఇచ్చి న్యాయం జరగలేదు. తక్కువ వేతనంతో పిల్లలను చదివించుకోవడం భారంగా వుంది. ఒంటరి మహిళా పింఛన్, వితంతు పింఛన్లు వర్తించాలి. ఒకే ఉద్యోగికి రెండు నిబంధనలు అన్యాయం. పనికి తగ్గ వేతనం వుంటే అన్ని భరిస్తాం.

శకుంతలమ్మ,
అంగన్వాడీ వర్కర్స్‌అండ్ హెల్పర్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు

శ్రమను గుర్తెరిగి పథకాలు ఇవ్వాలి

వర్కర్లు, హెల్పర్ల శ్రమను గుర్తెరిగి వేతనాలను పరిశీలించి ప్రభుత్వం సంక్షేమ పథకాలివ్వాలి. ప్రభుత్వ కార్యక్రమాల్లోను భాగస్వాములుగా పని చేస్తున్నాం. వేతనంలోను న్యాయం లేదు. సంక్షేమపథకాలు ఇవ్వడంలేదు. ఇంత కన్నా అన్యాయం ఏముంది. పాలకులు మాశ్రమను గుర్తించి పథకాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

రమాదేవి,
అంగన్వాడీ వర్కర్స్‌అండ్ హెల్పర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

'పురం' ఐటీ పరిశ్రమల స్థాపనకు అనువైన ప్రాంతం

ఐటి పరిశ్రమలను తీసుకురావడానికి ఎమ్మెల్యే కృషి చేయాలి
జెవివి సర్వసభ్య సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి-హిందూపురం

ఐటి పరిశ్రమ స్థాపనకు ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే అనువైన ప్రాంతం హిందూపురం నియోజకవర్గమని, విరివిగా ఐటి పరిశ్రమలను తీసుకురావడానికి స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రత్యేక దష్టి సారించాలని జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఈటీ రామ్మూర్తి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో జెవివి అధ్యక్షులు రామకృష్ణ అధ్యక్షతన జన విజ్ఞాన వేదిక సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ ఈటీ రామ్మూర్తి మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే పారిశ్రామికంగా హిందూపురం ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందనిదీంతో పాటు వ్యాపార రంగంలో సైతం దక్షిణ భారతదేశంలోనే పేరు గాంచిందని అన్నారు. ప్రస్తుతం ఉన్న పరిశ్రమల వల్ల స్థానికులకు పూర్తిస్థాయిలో ఉద్యోగ అవకాశాలు లభించడం లేదన్నారు. హిందూపురం నియోజకవర్గంలో ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న వారు వేలాది మంది ఉపాధి కోసం బెంగళూరుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికే ఐటి పరిశ్రమల స్థాపన కోసం హిందూపురం రూరల్ మండలం మలగూరు, గోరంట్ల మండలం పాలసముద్రం సమీప ప్రాంతాల్లో దాదాపు 500 ఎకరాల భూమిని ఐటి పరిశ్రమల స్థాపన కోసం భూ సేకరణ నిమిత్తం సర్వే సైతం పూర్తి చేశారన్నారు.. ఈ ప్రాంతంలో ఐటీ పరిశ్రమల స్థాపన కోసం ప్రభుత్వం చర్యలు చేపడితే, ఎన్నో కంపెనీలు పరిశ్రమల స్థాపన కోసం ముందుకు వచ్చే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా హిందూపురం ప్రాంతానికి అతి సమీపంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఉండడంతో ఐటీ పరిశ్రమ నిర్వాహకులు విరివిగా ఈ ప్రాంతాలకు రావడానికి అవకాశాలు ఉన్నాయన్నారు. వీటన్నింటిని గుర్తించి ప్రభుత్వం ఐటీ పరిశ్రమల ఏర్పాటు కోసం చొరవ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రాంత ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దీనిపై ప్రత్యేక దృష్టి సారించి పరిశ్రమలను తీసుకురావడానికి ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చేపట్టబోయే కార్యక్రమాల గురించి చర్చించారు. ఈ సమావేశంలో జన విజ్ఞాన వేదిక నాయకులు రామకృష్ణ, అతావుల్లా, వెంకటరామిరెడ్డి, ఉగ్రప్ప, ప్రభాకర్, చైతన్య గంగిరెడ్డి, నాగరాజ్ గుప్తా, అబ్దుల్ హఖ్, శివరామ్, ఓబులేశు, లక్ష్మీపతి, నారాయణ స్వామి, నరసింహులు, అలీముల్లా, పెన్నయ్య, చంద్రశేఖర్, శ్రీనివాసులు, అంజన రెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెవివి ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఈటీ రామ్మూర్తి

అడవి ఆముదం తిని 8 మంది పిల్లలకు అస్వస్థత

మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు

ప్రజాశక్తి - గుడిబండ

గుడిబండ మండలం రాళ్లపల్లి పంచాయతీ మైనాగానపల్లి గ్రామానికి చెందిన 8 మంది పిల్లలు గ్రామం బయట ఉన్న చెట్లలోని ఆడవిఆముదం కాయలు తిని తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గ్రామానికి చెందిన కొందరు పిల్లలు శనివారం సాయంత్రం గ్రామం బయటకు వెళ్లి అక్కడున్న అడవి ఆముదం కాయలు తిన్నారు. వాటిని తిన్న వెంటనే పిల్లలకు వాంతులు, వీరేచనాలు అయ్యాయి. పిల్లల కుటుంబసభ్యులు వెంటనే వారిని మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వీరిలో ఇద్దరిని మెరుగైన చికిత్స నిమిత్తం కర్నాటక రాష్ట్రం కొరటగేర ఆసుపత్రికి తరలించినట్లు పిల్లల కుటుంబసభ్యులు తెలిపారు. పిల్లల అస్వస్థత విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు డాక్టర్ శ్రీనివాస్ మూర్తి పిల్లల ఆరోగ్యంపై బాధితులతోనూ, వైద్యులతోనూ మాట్లాడారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో ఏ ప్రాంతంలో కూడా నీటి సమస్య తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలను తీసుకున్నట్లు మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ పేర్కొన్నారు. పట్టణ వ్యాప్తంగా ఉన్నా బోరు బావులను రీ ఫ్రెష్ చేయించి, వాటికి మోటార్లను బిగించిన నేపథ్యంలో ఆదివారం పట్టణంలోని ధర్మపురం ప్రాంతంలో బోరు బావిని పునరుద్ధరణ చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతు పూడుకు పోయిన బోరు బావులను కరువు నిధులతో రీ ఫ్రెష్ చేయించి, వాటికి మోటార్లను బిగించి వినియోగంలోకి తీసుకొస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులతో పాటు టిడిపి నాయకులు ఆశ్వర్థ నారాయణ, అంజి, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం :క్రమం తప్పకుండా యోగాను అభ్యసనం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని పొందవచ్చని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ పేర్కొన్నారు. యోగాంధ్రాలో భాగంగా ఆదివారం పట్టణంలోని గుడ్డం రంగనాథ స్వామి ఆలయ ప్రాంగణంలో యోగాసనాలు వేశారు. యోగా కేంద్రం కార్యదర్శి బద్రీనారాయణ యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, యోగ అభ్యాసకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి

ప్రజాశక్తి-హిందూపురం

పార్టీ అభివృద్ధి కోసం కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికి పార్టీ గుర్తించి వారికి న్యాయం చేస్తుందని వైసిపి నాయకులు వేణురెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డితో కలిసి కౌన్సిలర్లు, ముఖ్య నాయకులతో పార్టీ అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణురెడ్డి మాట్లాడుతు కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాది నుంచి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. ముఖ్యంగా అధికారం కోసం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో విఫలం అయిందన్నారు. వార్డు కౌన్సిలర్లు, ఇన్‌చార్జులు ప్రభుత్వ వైఫల్యలను ప్రజల్లోకి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో హిందూపురం పురపాలక సంఘంతో పాటు అన్ని పంచాయతీల్లో వైసిపి జెండాను ఎగరవేయాలన్నారు. దీని కోసం ఇప్పటి నుంచే ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు మద్దెన జయప్ప, షాజియా, నాగేంద్ర కుమార్, మల్లికార్జునతో పాటు ఇతర కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వంతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాల జీవోలను తక్షణమే విడుదల చేయాలని ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని సాయి ఆరామంలో ఆ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు త్రివేణి అధ్యక్షతన జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథు లుగా ధనలక్ష్మితో పాటు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్. వెంకటేష్ హాజరై మాట్లాడారు. జీవోలు విడుదల కాకపోవడంతో ఆశా వర్కర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలని, వారిని పర్మినెంట్ చేయాలని, పని భారం తగ్గించాలని, రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచి బీమాతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పని వేళలు 8 నుంచి 10 గంటలకు పెంచడం దుర్మార్గమన్నారు. 24 గంటలూ విధుల్లో ఉండాలని, అవసరమైన ప్పుడు సెలవులు కూడా మంజూరు చేయడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం 40 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా కుదించి కార్మికులకు తీవ్ర ద్రోహం చేస్తోందన్నారు. మోడీ మెప్పు కోసం చంద్రబాబు వంత పాడుతున్నారన్నారు. యోగా కడుపు నిండిన వారికి ఉపయోగం అని కార్మికులకు కాదన్నారు. ఆయా సమస్యలపై ఉద్యమించడానికి తగిన భవిష్యత్తు కార్యక్రమాలు చేపట్టడానికి సన్నద్ధం అవుతున్నామన్నారు. జులై 9వతేదీ చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఆశా కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సదస్సులో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు బి.సాంబశివ, ప్రధాన కార్యదర్శి సౌభాగ్య, మున్సిపల్ వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఆటో వర్కర్ల యూనియన్ కార్యదర్శి పెడపల్లి బాబా, అంజనమ్మ, రమాదేవి, నారాయణమ్మ, అమీన, మహాలక్ష్మి, లలిత, లక్ష్మీ, కాంతమ్మ, మంజుల పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

గాలికి కూలిన వృక్షం

తృటిలో తప్పిన పెనుప్రమాదం

ప్రజాశక్తి-హిందూపురం

ఆదివారం సాయంత్రం వీచిన గాలికి హిందూపురం రూరల్ మండల పరిధిలోని కెరికెర పంచాయితీ మిత్తిమీద పల్లి గేటు వద్ద పెద్ద చెట్టు విరిగి విద్యుత్ స్తంభంపై పడింది. దీంతో ఆ విద్యుత్ స్తంభం విరిగి పక్కనే ఉన్న టాటా ఏసీ మీద పడింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. ఆదివారం ఉదయం నుంచి పట్టణంతోపాటు రూరల్ మండల వ్యాప్తంగా మేఘాలు కమ్ముకున్నాయి. సాయంత్రం కొద్దిగా చినుకులు పడ్డాయి. ఆ సమయంలో భీకర గాలులు రావడంతో చెట్టు ఒక్కసారిగా కుప్పకూలింది. ఆ సమయంలో ఆ ప్రాంతంలో ఎవరు లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. వెంటనే అప్రమత్తమైన విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేసి మరమ్మతులు చేపట్టారు.

గాలికి విరిగిన చెట్టు

అనుమతులు లేకుండా ధర్నాలు రాస్తారోకోలు చేస్తే చర్యలు

ఎస్పీ రత్న

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పోలీసుల అనుమతి లేకుండా సభలు సమావేశాలు నిర్వహించరాదని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ వి రత్న పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సభలు సమావేశాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా ఉండాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఒక నేరం జరిగినప్పుడు అనుమతులు లేకుండా ఎటువంటి ధర్నాలు రాస్తారోకోలు చేపట్టరాదని 30 యాక్ట్ అమలులో ఉంటుందని వీటిని ప్రతి ఒక్కరూ గమనించాలని అన్నారు. మహిళలు చిన్నారులతో పాటు తల్లితండ్రి లేని పిల్లల పట్ల ఒంటరి మహిళల పట్ల జరిగే నేరాలను అరికట్టడానికి శక్తి టీంను ఏర్పాటు చేసి చురుకుగా పనిచేసేలా చూస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం ఏర్పాటుచేసిన శక్తి యాప్ ను వినియోగించుకోవాలని సూచించారు. అంతేకాకుండా శక్తి వాట్సాప్ నెంబర్, 7993485111 ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చున్నారు. అదేవిధంగా డయల్ 100, 112, 1930,1098, నెంబర్లకు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ తెలిపారు. ప్రజలు కూడా తమ ఎదుట నేరం జరుగుతున్నప్పుడు వాటిని నివారించేందుకు వీలుగా బాధ్యతగా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మహిళలు బాలికల పట్ల జరుగుతున్న అఘాయిత్యాలను అడ్డుకట్ట వేయడానికి ప్రతి పాఠశాలలు, కళాశాలలతో పాటు హాస్టల్లో స్వీయ రక్షణ శిక్షణ(“సెల్ఫ్ డిఫెన్స్”) కోర్సులు అమలు చేయడం జరుగుతుందని వాటి ద్వారా బాలికలు సాహసం నమ్మకం పెంచుకొని తమని రక్షించుకోవాలని చెప్పారు. ఫోక్సో కేసుల్లో బాధితుల వివరాలు వెల్లడించకూడదన్నారు. నేరస్తుల వివరాలను సేకరించడంలో పోలీసులకు సహకరించిన వ్యక్తుల పేర్లను గోప్యంగా ఉంచడంతో పాటు, వారికి గుర్తింపు ఇవ్వడం జరుగుతుందన్నారు. నేర నియంత్రణ పట్ల అవగాహన కల్పించుటకు ప్రతి ఒక్కరూ సహకరించాల్సి ఉందని ఎస్పీ కోరారు. ఈ సమావేశంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్ కుమార్ , తలుపులు ఎస్ నర్సింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

శ్రీ సత్య సాయి జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఇ సంపత్ కుమార్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాలో గృహాలకు, రైతులకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్తును అందజేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాన్స్‌కో జిల్లా ఎస్ఇ సంపత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో విద్యుత్ సరఫరాకు సంబంధించి పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : రైతులకు 9 గంటలు నిరంతరాయంగా విద్యుత్తును అందజేస్తున్నారా?

జవాబు: ప్రస్తుతం రైతులకు వ్యవసాయ పంపుసెట్లకు పగటి పూట రెండు దపాలుగా విద్యుత్ సరఫరాను చేస్తున్నాం. రైతులకు విద్యుత్ అందించడంలో నూతన పద్ధతులను ద్వారా అంతరాయం లేకుండా లోవోల్టేజ్ సమస్య లేకుండా నాణ్యమైన విద్యుత్ విద్యుత్తును అందిస్తున్నాము.

ప్ర : జిల్లావ్యాప్తంగా నూతనంగా ఎన్నిఎన్ని సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారు?

జ: శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా ఉన్న సబ్ స్టేషన్లో తో పాటు కొన్నిచోట్ల లో వోల్టేజ్ సమస్య కారణంగా కొత్త సబ్ స్టేషన్లను ప్రభుత్వం మంజూరు చేసింది. అవి నిర్మాణ దశలో ఉన్నాయి. కొన్నింటిని పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేసాం. మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. ఇందులో భాగంగా పుట్టపర్తి మండల పరిధిలోని నిడిమామిడి ,వెంగళమ్మ చెరువు, పుట్టపర్తి వెస్టిగేట్ సమీపంలో ఏర్పాటు చేస్తున్నాం. వీటి పనులు త్వరలో ముగియనున్నాయి. అవి అందుబాటులోకి వస్తే పుట్టపర్తి మండలంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం ఉండదు.

ప్ర : జిల్లా వ్యాప్తంగా రైతులకు విద్యుత్ కనెక్షన్లు ఎన్ని ఉన్నాయి? రైతులకు నూతన కనెక్షన్లు మంజూరు చేయలేదా?

జ: శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా బోరుబావుల కింద రైతులకు 1. 53 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. గత కొంతకాలం నుండి నూతన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ కనెక్షన్లు అందించలేదని పలువు రైతులు ఆందోళన చెందుతున్న విషయం వాస్తవమే. దానికి సంబంధించిన విద్యుత్ పరికరాలు సకాలంలో అందకపోవడంతో రైతులకు అందించలేకపోయాం. ఇటీవల దరఖాస్తు చేసుకున్న రైతులకు జూన్ ఆఖరుకు నూతన విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు అందజేసి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందజేస్తాం.

ప్ర : పట్టణ ప్రాంతాల్లో వేళా పాలలేని విద్యుత్ కోతలపై మీ సమాధానం?

జ: వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వర్షం, ఉరుములు ,మెరుపులు, వచ్చినప్పుడు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, గాలులకు కొన్నిచోట్ల విద్యుత్తు లైన్లు విద్యుత్ స్తంభాలు విరిగిపోవడం, వైర్లు పెనవేసుకోవడం తో ఆ సబ్ స్టేషన్ పరిధిలో అంతరాయం ఏర్పడుతుంది. వాటిని సంబంధిత లైన్‌మెన్లు గ్రహించి పునరుద్ధరణ చేసేందుకు సమయం పడుతుంది. దాని ద్వారా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. నూతన టెక్నాలజీ కారణంగా జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు అన్ని సబ్ స్టేషన్లలోనూ విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ట్రాన్స్‌కో ఎస్ఇ సంపత్‌కుమార్

రాష్ట్ర సరిహద్దులు దాటుతున్న ఇసుక..!

పగలు కొంకల్లు చెరువు నుంచి డంప్‌నకు..
రాత్రి వేళ యథేచ్ఛగా కర్నాటకకు తరలింపు
చోద్యం చూస్తున్న అధికారులు

డంప్ చేసిన ఇసుక

ప్రజాశక్తి-గుడిబండ

మండల పరిధిలోని కొంకల్లు, గుడ్డదహళ్లి గ్రామాలు కేంద్రంగా రెండు, మూడు నెలలుగా ఇసుక దందా గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్నా పట్టించుకునే వారే లేరని ఆ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కొంకల్లు, దేవరహట్టి గ్రామాలకు చెందిన ఇద్దరు నాయకులు కలిసి కొంకల్లు చెరువులో జెసిబిని పెట్టి ఇసుకను తవ్వించి ట్రాక్టర్ల ద్వారా కొంకల్లు గ్రామంతో పాటు గుడ్డదహళ్లి గ్రామ సమీపంలోని ఓ నాయకుని పొలం వద్ద బండపై వందలాది లోడ్లు ఇసుకను డంప్ చేస్తారు. ఇక్కడి నుంచి ఇసుకను రాత్రివేళ టిప్పర్లు, లారీలకు నింపి కర్నాటకలోని బెంగళూరు, మధుగిరి, కొరటగేర, తుమకూరు, శిర, చంద్రబావి, వసకెర, తదితర ప్రాంతాలకు తరలిస్తూ అక్రమ మార్గంలో రూ. లక్షల సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు బలంగా

టిప్పర్‌కు ఇసుక లోడ్ చేస్తున్న జెసిబి

వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ ఇద్దరు నాయకులు కొంకల్లు చెరువు నుంచి వందలాది లోడ్ల ఇసుకను కర్నాటకలోని వివిధ ప్రాంతాలకు తరలించారని ఆ చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలు, యువకులు, రైతులు బాహిరంగంగా చర్చించుకుం టున్నారు. పేదలు ఇంటి నిర్మాణాల కోసం ఇసుక కోసం వెళ్తే అనేక షరతులు విధించి అడ్డుకునే అధికారులకు ఇలాంటి వారు కనిపించరా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ గ్రామాల్లోనే కాకుండా మండలంలోని మందలపల్లి, దేవరహట్టి, ఎస్.రాయపురం, గొల్లపల్లి, తదితర గ్రామాల్లో కూడా ఇసుక అక్రమణ రవాణా దందా యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో వారు మరింత రెచ్చిపోయి పలు చెరువుల్లో జెసిబిలు ఏర్పాటు చేసి విచ్చలవిడిగా ఇసుకను తవ్వించి కర్నాటకకు యథేచ్ఛగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు ప్రజలు మండిపడుతున్నారు. ఇదిలా ఉండగా చాలామంది ట్రాక్టర్ల యజమానులు కూడా వంకలు, చెరువుల్లో ఇసుకను తవ్వి కర్నాటకలోని సమీప ప్రాంతాలకు అక్రమంగా రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి మండలంలో విస్తృతంగా దాడులు చేసి ఇసుకను డంప్‌లను సీజ్ చేయడంతో పాటు ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. అలాగే పేదకు ఉచితంగా ఇసుకను పంపిణీ చేయాలని అభిప్రాయపడుతున్నారు.

విద్యార్థులందరికీ 'తల్లికి వందనం' : మంత్రి

ప్రజాశక్తి-పరిగి

ఇంటర్మీడియట్‌లో కొత్తగా చేరనున్న విద్యార్థులతో పాటు 1వ తరగతిలో అడ్మిషన్ పొందే ప్రతి విద్యార్థికీ తల్లికి వందనం పథకం వర్తిస్తుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత భరోసా ఇచ్చారు. మంత్రి ఆదివారం మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో రాము ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా మంత్రికి రాము దంపతులతో పాటు రామచంద్ర పూలబొకే ఇచ్చా స్వాగతం పలికారు. అలాగే మంత్రికి జ్ఞాపికను అందజేశారు. అనంతరం మంత్రి స్థానిక మహిళతో పాటు విద్యార్థులతో ముచ్చటించారు. తల్లికి వందనం ద్వారా బ్యాంకు ఖాతాల్లో నగదు పడిందా అని తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో ఒక విద్యార్థికి మాత్రమే అమ్మఒడి ద్వారా నగదు అందించే వారని ఇప్పుడు ఇంట్లో ఉన్న ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో రూ. 13వేలు పడడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, సర్పంచి బాలాజీ, మారుతిప్రసాద్, సిద్ధప్ప, విష్ణు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ మండపానికి నేడు స్థల పరిశీలన

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

ఓబుళదేవరచెరువులో వడ్డే ఓబన్న కళ్యాణమండపం నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించేందుకు సోమవారం ఎంపీ బికె.పార్థసారథి, మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఓడిసి వస్తున్నట్లు టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జడ్పిటిసి పిట్టా ఓబుల్‌రెడ్డి తెలిపారు. వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, వడ్డెర ముద్దుబిడ్డ వడ్డే ఓబన్న జ్ఞాపకార్థం ఓడిసిలో కళ్యాణ మండపం నిర్మాణం చేపట్టనున్నారన్నారు. ఇందులో భాగంగా కళ్యాణ మండపం ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను వారు పరిశీలిస్తారన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అంజనప్ప, తదితరులు పాల్గొన్నారు.

104 సిబ్బందికి వేతన బకాయిలు చెల్లించాలి

సమావేశమైన సిఐటియు నాయకులు, 104 సిబ్బంది

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

104 సిబ్బందికి వేతన బకాలయిలు వెంటనే చెల్లించాలని 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆదివారం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, 104 ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి జయచంద్ర ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గతంలో అరబిందో యాజమాన్యం 104 ఉద్యోగులకు 2 నెలల వేతనాలు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగులకు వేతనాలు, ఇతర బకాయిలు (ఈఎల్, గ్రాట్యుటీ) చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం 104 సర్వీసులు నిర్వహిస్తున్న భవ్య హెల్త్ సర్వీస్ ప్రయివేట్ లిమిటెడ్ యాజమాన్యం కూడా ఉద్యోగులకు ప్రతి నెలా సక్రమంగా వేతనాలు చెల్లించాలని, ప్రస్తుతం జిల్లాలో ఉన్న స్థానాల్లో సీనియారిటీ ప్రకారం బదిలీలు చేసి మిగతా స్థానాల్లో కొత్త వారితో నియామకాలు చేపట్టాన్నారు. పాడైన వాహనాలకు వెంటనే మరమ్మతులు చేయించాలని, భవ్య యాజమాన్యం ప్రతి నెల అన్ని జిల్లాల్లో గ్రీవెన్స్ మీటింగ్ నిర్వహించి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. 104 వాహనాల్లో క్షయ పరీక్షలకు సంబంధించిన నమూనాలు రవాణా చేయడం ప్రమాదకరమని, ఈ విషయంపై ప్రభుత్వం పునరాలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. సమావేశంలో నరేష్, నాగరాజు, సూరి, సోమశేఖర, బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ నేరం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఆర్‌డిఒ మహేష్

లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని ఆర్‌డిఒ మహేష్ ఆదివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. పుట్టబోయేది ఆడబిడ్డా..? లేక మగ బిడ్డా..? అని తెలుసుకోవడం చట్టరీత్యా నేరం అన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడిన వైద్యునికి మొదటి తప్పుకు మూడేళ్ల జైలు శిక్ష, రూ. 10వేల జరిమానాతో పాటు భారత వైద్య మండలి జారీ చేసిన వైద్య ధ్రువీకరణ పత్రం ఐదేళ్ల వరకూ తొలగిస్తారన్నారు. మరోమారు లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడితే ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 50వేల జరిమానాతో పాటు భారత వైద్యమండలిలో పొందిన వైద్య ధ్రువీకరణ పత్రాన్ని శాశ్వతంగా రద్దు చేస్తార న్నారు. ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేయమని అడిగినా, ప్రోత్సహించినా మొదటి తప్పుగా మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 50 వేల జరిమానా తప్పదన్నారు. మరో మారు ఉల్లంఘిస్తే ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ. లక్ష జరిమానా విధిస్తారన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన వారు, చేయించుకున్న వారు, ప్రోత్సహించిన వారందరూ శిక్షార్హులే అన్నారు. ప్రయివేటు ఆసుపత్రుల యాజమాన్యాలు లింగ నిర్ధారణ చేయకుండా ప్రభుత్వ నియమ నిబంధనలను తప్పక పాటించాలన్నారు.

బెల్టు షాపులు తొలగించాలని ఫిర్యాదు

హిందూపురం : మద్యం బెల్టు షాపులు తొలగించి, నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పట్టణం లోని ముదిరెడ్డిపల్లి ప్రాంత మహిళలు ఆదివారం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మహిళలు మాట్లాడుతూ టిడిపి కౌన్సిలర్ భర్త ప్రోత్సాహంతోనే మా ప్రాంతంలో మద్యం బెల్టు షాపు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. మద్యం ప్రియులు తాగిన మైకంలో ఇష్టారాజ్యంగా ద్విచక్ర వాహనాలు నడపడం, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే బెల్గు షాపు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా పట్టణంతో పాటు గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సిఐ లక్ష్మీదుర్గయ్య హెచ్చరించారు. ముదిరెడ్డి మహిళలు ఫిర్యాదుతో తనిఖీలు నిర్వహించారు.

ఎన్నికల పరిశీలకునిగా పాండురంగప్ప

మడకశిర : లేపాక్షి మండలంలో టిడిపి సంస్థాగత ఎన్నికల పరిశీలకుడిగా కుంచిటి వక్కలిగ బిసి సాధికారిక రాష్ట్ర కన్వీనర్ వి.ఎం.పాండురంగప్పను నియమించారు. ఈయన గతంలో టిడిపి మండల కన్వీనర్‌గా, సర్పంచిగా, జడ్పిటిసిగా పని చేసి ప్రస్తుతం రాష్ట్ర బిసి సాధికారిక కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు.

పేకాట జూదరుల అరెస్టు.. రూ. 1.94 లక్షలు స్వాధీనం

హిందూపురం : డీఎస్పీ మహేష్ నేతృత్వంలో శని, ఆదివారాల్లో పోలీసులు పేకాట స్థావరాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఆదివారం అప్‌గ్రేడ్ స్టేషన్ సిఐ ఆంజనేయులు, టూటౌన్ సిఐ అబ్దుల్ కరీం రెండు బృందాలుగా ఏర్పడి పరిగి రోడ్డు, ముదిరెడ్డిపల్లి ప్రాంతాల్లో మెరుపు దాడులు నిర్వహించారు. మొత్తం 20 మందిని అరెస్టు చేయడంతో పాటు రూ. 1,94,650 నగదు స్వాధీనం చేసుకన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ సబ్ డివిజన్ వ్యాప్తంగా పేకాట ఆడినా, ఆడించినా ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

'తల్లికి వందనం' చారిత్రాత్మకం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఎన్నికల హామీ మేరకు సిఎం చంద్రబాబు 'తల్లికి వందనం' పథకం ద్వారా అర్హులైన కుటుం బంలో ఎంతమంది ఉంటే అంత మంది విద్యార్థులకు రూ. 13 వేల చొప్పున విద్యార్థి తల్లి బ్యాంకు ఖాతాలో నగదు జమ చేయడం ఒక చారిత్రత్మకం అని తెలుగు యువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుమలేశ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ సిఎం చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలుపుతున్నారన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండల పరిధిలోని మల్లమీదపల్లి పంచాయతీలో ఆదివారం పాలెం ఆంజనేయులురెడ్డి ఆసుపత్రి చిన్నపిల్లలు వైద్యులు పి.హర్షవర్ధన్‌రెడ్డి, కె.లిఖిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యులు మాట్లాడుతూ వైద్య శిబిరంలో 115 మందికి జ్వరం, దగ్గు, తలనొప్పి, షుగర్, బిపి తదితర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశామని తెలిపారు. కదిరి పట్టణంలో రైల్వే స్టేషన్ మెయిన్ రోడ్డులో పాలెం ఆంజనేయులురెడ్డి ఆసుపత్రిని ఇటీవల ప్రారంభించామన్నారు. నిరుపేదలకు ఉచితంగా వైద్యం అందిస్తామని తెలిపారు. అనంతరం గ్రామస్తులు సి.కొండయ్య, శ్రీరాములు, రఫీ, గంగాధర్, తదితరులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిన వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు పి.హర్షవర్ధన్‌రెడ్డి, కె.లిఖిత

క్రీడాకారులకు టీ షర్టులు అందజేస్తున్న సాధిక్, నజీర్

పోటాపోటీగా క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న అండర్-14 క్రికెట్ పోటీలు పోటాపోటీగా జరుగుతున్నాయని క్రికెట్ కోచ్ నజీర్ తెలిపారు. ఆదివారం ఉదయం జరిగిన తొలి మ్యాచ్‌లో కేసీసీ-ఎ జట్టు 204 పరుగులు చేయగా బి జట్టు లక్ష్యాన్ని ఛేదించింది. మను-73, గౌస్-74, మోహన్-42, షకీల్-35 పరుగులతో రాణించారు. రెండో మ్యాచ్‌లో అండర్-14 జట్టు 40 ఓవర్లలో 185 పరుగులు చేసింది. సాధిక్-60, ప్రణయ్ 35 పరుగులు చేశారు. సంతోష్-3, యుక్తి, ఫర్హాన్ చెరో రెండు వికెట్లు తీశారు. ముఖ్యఅతిథిగా హాజరైన సాధన పాఠశాల హెచ్‌ఎం సాధిక్ ప్రతిభావంతులైన క్రీడాకారులకు జిల్లా క్రికెట్ సంఘం సమకూర్చిన టీ షర్ట్స్ అందజేశారు.

స్కీం వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

స్కీం వర్కర్లు, మున్సిపల్ కార్మికులతో పాటు ఇతర కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఇంజినీరింగ్,

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

పుడాలో పనిచేస్తున్న కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. పట్టణంలోని గణేష్ సర్కిల్‌లో ఆదివారం ఆయన విలేకరు లతో మాట్లాడుతూ స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలని, ఒప్పంద కార్మికులంను పర్మినెంట్ చేయాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా తక్కువ వేతనాలతో పని చేస్తున్నప్పటికీ వారికి కనీస వేతనాలు అందడం లేదన్నారు. వీరు పూర్తిస్థాయి ప్రభుత్వ ఉద్యోగులు కారని వారికి కనీసం సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. కార్మికులందరికీ ఈఎస్ఐ, పిఎఫ్ బకాయిలు చెల్లించాలన్నారు. కార్మికుల సమస్యలపై జులై 9వ తేదీ చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పైపల్లి గంగాధర్, ఆటో కార్మిక యూనియన్ కార్యదర్శి పెడపల్లి బాబా పాల్గొన్నారు.

'సేవ్ ఆర్‌డిటి' పాదయాత్రకు రఘువీరా సంఘీభావం

ప్రజాశక్తి-మడకశిర రూరల్

'సేవ్ ఆర్‌డిటి' పేరుతో కళ్యాణదుర్గం నియోజకవర్గంలో మాజీ ఎంపీ తలారి రంగయ్య చేపట్టిన పాదయాత్రకు ఆదివారం సిడబ్ల్యుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి సంఘీభావం తెలిపారు. రఘువీరా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆర్‌డిటి విదేశీ నిధులకు సంబంధించిన ఎఫ్‌సిఆర్‌ఎను తక్షణమే రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్‌డిటి సంస్థ ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా అనేక సేవా, అభివృద్ధి పనులు చేస్తుందని, అవి కొనసాగాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్‌డిటి సంస్థకు అన్ని విధాలా సహకరించాలని కోరారు. ఆర్‌డిటిని కాపాడుకోవాల్సిన అవసరం అన్ని రాజకీయ పార్టీలపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ పెద్దలతో మాట్లాడుతానని తెలిపారు. పాదయాత్రలో ఎఐసిసి సభ్యులు కె.సుధాకర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రశాంతంగా జీవించండి

ప్రజాశక్తి-కొత్తచెరువు

గ్రామాల్లో ప్రజలు ఎలాంటి కక్షలు, గొడవలు, అసాంఘిక కార్యక్రమాల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సిఐ మారుతిశంకర్ సూచించారు. సిఐ ఆదివారం మండలంలోని రౌడీషీటర్లను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. గతంలో కేసుల్లో ఉన్న వారు ఇకపై పద్ధతిగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిం చారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి :టిడిపి

ప్రజాశక్తి-నల్లచెరువు

వైసిపి నాయకులు వ్యక్తిగత ఆరోపణలు మాని మండల అభివృద్ధికి సహకరించాలని టిడిపి మండల కన్వీనర్ రాజశేఖర్ బాబు హితవు పలికారు. సీనియర్ టిడిపి నాయకులు బార్ బషీర్ నివాసంలో ఆదివారం రాజశేఖర్‌బాబు ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత వైసిపి పాలనలో కంటే ఇప్పుడు ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఎన్నికల హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. మండలంలో ఇప్పటికే రూ. కోట్లు ఖర్చు చేసి సీసీ రోడ్లు నిర్మించామన్నారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో కదిరి నియోజవర్గంలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయన్నారు. మాజీ జడ్పిటిసి అబ్దుల్, మాజీ ఎంపీపీ మాబుసాబ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అన్ని సామజిక వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. నాగభూషణ్ నాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కదిరి నియోజకవర్గంలో బలుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. సీనియర్ నాయకులు వెంకటరమణ మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో ఇప్పటికే 70శాతం అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు. తల్లికి వందనం పథకం పట్ల ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు అశ్వర్థ నాయుడు, రమణారెడ్డి, దేవేంద్ర, కిరణ్‌నాయుడు, రమేష్ నాయుడు, లక్ష్మీపతినాయుడు, దేవలం వేణు, ఆదెప్ప, రామచంద్ర, రమణ, ఆనంద్, కరుణాకర్ నాయుడు, అంజి పాల్గొన్నారు.

'వైసిపి శ్రేణులు నోరు అదుపులో పెట్టుకోవాలి'

ప్రజాశక్తి-కదిరి టౌన్



డైమండ్ ఇర్ఫాన్

వైసిపి నాయకులు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని టిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ హెచ్చరించారు. ఇటీవల గాండ్లపెంట మండలంలోని గొడ్డువెలగల పంచాయతీలో అభివృద్ధి పనులకు సంబంధించి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శిలాఫలకాన్ని ఆవిష్కరించగా గాండ్లపెంట మాజీ ఎంపీపీ జగన్మోహన్ ధ్వంసం చేశారు. దీంతో టిడిపి నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆదివారం పోలీసులు జగన్మోహన్‌ను అరెస్టు చేశారు. అతడి అరెస్టును నిరసిస్తూ వైసిపి నాయకులు రూరల్ పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించడంతో పాటు ఎమ్మెల్యే కందికుంటపై నోటికొచ్చినట్లు మాట్లాడారు. ఆ మాటలను ఇర్ఫాన్ మీడియా సమావేశంలో తీవ్రంగా ఖండించారు. ఇర్ఫాన్ మాట్లా డుతూ వైసిపికి అమ్ముడుపోయిన మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా నిజాయితీపరుడినని మాట్లాడ డం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని విమర్శించారు. ఇక క్షుద్ర పూజలు చేసే వజ్రభాస్కర్‌రెడ్డి గతాన్ని మరిచిపోయి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఓ చిట్ ఫండ్ కంపెనీలో చిరుద్యోగిగా పని చేసిన వజ్రభాస్కర్‌రెడ్డి ఎంతమంది పొట్ట గొట్టి, ఎన్ని క్షుద్ర పూజలు చేసి ఇంత స్థాయికి ఎదిగారని ప్రశ్నించారు. అలాంగి వ్యక్తులకు ఎమ్మెల్యే కందికుంట గురించి మాట్లాడటం అర్హత లేదన్నారు. మా నాయకుడు అభివృద్ధి కోసం పరితపిస్తుంటే మీరు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని నోరు అదుపులో పెట్టుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు.

బైక్‌లు ఢీకొని వ్యక్తికి గాయాలు

ధర్మవరం రూరల్ : పట్టణంలోని గూడ్స్ షెడ్ కొట్టాలకు చెందిన నరేష్ ఆదివారం తన ద్విచక్ర వాహనంపై మేడాపురం గ్రామం వెళ్లి తిరిగి గూడ్స్ షెడ్ కొట్టాలకు బయల్దేరాడు. మార్గమధ్యలో పట్టణంలోని గాంధీనగర్ చౌడమ్మ గుడి సమీపంలో ఆగి ఉన్న పాల వ్యాన్‌ను వెనుక వైపున ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి నరేష్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నరేష్‌ను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నరేష్ విద్యుత్ మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి..

కొత్తచెరువు : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో మండలంలోని లోచర్ల గ్రామానికి చెందిన కురుబ మారుతి కుమారుడు దీక్షిత్ సాయి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. మారుతి ఆదివారం ఉదయం భార్య, పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంపై మరుకుంటపల్లి వద్ద ఉన్న వారి తోట వద్దకు వెళ్తుండగా ఆ గ్రామానికి చెందిన వడ్డే అశోక్ ద్విచక్ర వాహనంపై ఎదురుగా వేగంగా వచ్చి వీరిని ఢీకొన్నారు. దీంతో దీక్షిత్‌సాయి తీవ్రంగా గాయపడగా, మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయం తెలియడంతో పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వారిని కొత్తచెరువు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన దీక్షిత్‌సాయిని మెరుగైన చికిత్స కోసం అనంతపురం తీసుకెళ్లారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ మారుతి శంకర్ తెలిపారు.

శిలాఫలకం ధ్వంసంపై కేసు నమోదు

గాండ్లపెంట : మండలంలోని నీరుకుంట్లపల్లెలో శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన సంఘటనకు సంబంధించి ఆదివారం ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు జమేదారు గంగాధర్ తెలిపారు. వివరాలు.. పలు అభివృద్ధి పనులకు సంబంధించి ఇటీవల మండలంలోని గొడ్డువెలగల పంచాయతీ పరిధిలోని నీరుకుంట్లపల్లెలో శిలాఫలకం ఏర్పాటు చేశారు. ఈ నెల 11వ తేదీ ఎంపిడిఓ వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆ శిలాఫలకాన్ని ప్రారంభించారు. అయితే ఈ శిలాఫలకాన్ని 13వ తేదీ రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీనికి సంబంధించి వంకలోపల్లికి చెందిన మాజీ ఎంపీపీ జగన్మోహన్, నీరుకుంట్లపల్లికి చెందిన ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు జమేదారు తెలిపారు.

'ఎపిని భ్రష్టు పట్టించిన కూటమి ప్రభుత్వం'

వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-మడకశిర

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉషశ్రీచరణ్, నాయకులు

సిఎం చంద్రబాబు అన్ని వర్గాల ప్రజలకు వెన్నుపోటు పొడిచి రాష్ట్రాన్ని ఎలా అధోగతి పాలు చేశారని వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ మండిపడ్డారు. పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో ఆదివారం ఉషశ్రీచరణ్, ఆ పార్టీ హిందూపురం పార్లమెంట్ ఇన్‌ఛార్జి రమేష్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప ఆధ్వర్యంలో 'జగన్ అంటే నమ్మకం.. బాబు అంటే మోసం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ ఈ బుక్ డిజిటల్ కాపీ కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ఈ ఏడాది పాలనలో అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు వజ్రభాస్కర్‌రెడ్డి, ఆనంద రంగారెడ్డి, మండల కన్వీనర్ అంజన్ రెడ్డి, నళిని రంగేగౌడ్, నరసింహమూర్తి, తిప్పేస్వామి, నరసింహా, మంజునాథ్, మల్లికార్జున, జయరాజు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలకు సిద్ధం కండి

బత్తలపల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజా పోరాటా లకు ప్రజలు సిద్ధం కావాలని సిపిఐ నాయకులు పిలుపు నిచ్చారు. సిపిఐ నాయకులు ఆదివారం మండలంలోని పోట్లమర్రి, గంటాపురం గ్రామాల్లో పర్యటించి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులు గా ఎపి రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, మండల కార్య దర్శి బండల వెంకటేష్ హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏడాదైనా హామీలను నెరవేర్చకపో వడం ప్రజలను మోసం చేయడమే అన్నారు. కావున గ్రామస్థాయిలో పోరాటాలకు సిద్ధం చేస్తూ భవిష్యత్తులో ప్రజా పోరాటాలకు నాంది పలకాలన్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు మాల్యవంతం కుళ్లాయప్ప, రామకృష్ణ, సన్నపెద్దన్న, బద్దల నాగభూషణ, సత్యమయ్య, సత్యప్ప, ఓబులేసు, నారాయణ, నాగరాజు. రామాంజనేయులు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మహిళ హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

అనుమానంతో సహజీవనం చేస్తున్న ఓ మహిళను చంపిన నిందితుడిని ఎట్టకేలకు పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్పీ వి.రత్న తెలిపారు. పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం ఎస్పీ రత్న డీఎస్పీ విజయ్ కుమార్‌తో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గాండ్లపెంట మండలం సాదులవాండ్లపల్లికి చెందిన ఆంజనేయులు, సరస్వతి(35) దంపతులు. వారి మధ్య విభేదాలు రావడంతో కోర్టులో విడాకులకు దరఖాస్తు చేసుకున్నారు. ఆ తర్వాత సరస్వతి తన ఇద్దరు కుమారులను తీసుకుని 8 ఏళ్ల క్రితం తలుపులలోని బలిజపేటలో నివాసం ఉంటూ కూలి పనులు చేసుకుని జీవనం సాగించేది. ఈ క్రమంలో స్థానికంగా ఉండే బేల్దారి సికిందర్‌తో పరిచయం ఏర్పడింది. అది కాస్తా వారి మధ్య సహజీవనానికి దారితీసింది. సికిందర్‌కు ఇది వరకే వివాహమైనా సరస్వతితో సహజీవనం కొనసాగించేవాడు. సరస్వతి మరొకరితో చనువుగా ఉంటూ తరచూ ఫోన్‌లో మాట్లాడుతోందని అనుమానం పెంచుకున్న సికిందర్ ఆమెతో పలుమార్లు గొడవపడ్డాడు. గత ఏప్రిల్ 22వ తేదీ సరస్వతి ఇద్దరు కుమారులు కదిరిలో జరిగే ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన సికిందర్ ఇంట్లో ఒంటరిగా ఉన్న సరస్వతితో మరోమారు గొడవపడి నైలాన్ దారంతో గొంతుకు బిగించి హత్య చేశాడు. అదే రోజు మృతదేహాన్ని మూట కట్టుకుని ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి తలుపుల గండి రోడ్డు సమీపంలోని జమ్ముగడ్డవంక గడ్డ కింద పూడ్చి రాళ్లు పేర్చేశాడు. అనుమానం రాకుండా సరస్వతి ఇంటికి యథావిధిగా రాకపోకలు సాగించేవాడు. నెలన్నర దాటినా సరస్వతి గురించి ఆచూకీ తెలియకపోవడంతో పెద్దకుమారుడు తలుపుల పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఎస్పీ ఆదేశాల మేరకు పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టిన పోలీసులు అనుమానితునిగా ఉన్న సికిందర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సికిందర్ రాజంపేట వద్ద ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అరెస్ట్ చేసేందుకు వెళ్లగా, ఈ విషయం పసిగట్టిన నిందితుడు నేరం అంగీకరించి తలుపుల తహశీల్దార్ ఎదుట లొంగిపోయాడు. అనంతరం తహశీల్దార్ నిందితుడిని తలుపుల ఎస్ఐకు అప్పగించారు. పోలీసులు నిందితుడి నుంచి హత్యకు ఉపయోగించిన పరికరాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రత్న, డీఎస్పీ, సిఐలు

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) గారి కోర్టు, కదిరి.

I.A. No:564/2021 in O.S. No:99/2021

Between:

జి.శ్రీనివాసులు ...పిటీషనర్-వాది

మరియు

కె.ముస్తఫా ...రెస్పాండెంట్-ప్రతివాది

రెస్పాండెంట్-ప్రతివాది అయినా కె.ముస్తఫా హాజరు కొరకు

కె.ముస్తఫా S/o కె.ఖాసీంవలి, డోర్ నెం.1-152 మెయిన్ రోడ్, కురుమాల గ్రామం, నల్లమాడ్ల మండలం, శ్రీ సత్యసాయి జిల్లా అయిన నీకు ఇందుమూలముగా తెలియజేయడము ఏమనగా పై కోర్టులో నీపైన జి.శ్రీనివాసులు S/o జి.నారాయణప్ప, సంజీవుపల్లి, నల్లమాడ మండలం అను పిటీషనర్-వాదికి రావల్సిన ప్రామిస్సోరీ నోటు బాకీకి గాను మీ పేరుతో కురుమాల రెవెన్యూ గ్రామంలోని భూమిని Ac.2-94 cts, S.No.508-1 అటాచ్మెంట్ కోరుతూ పై కోర్టులో పై అర్జీని దాఖలు చేసినాడు.కావున పై కోర్టులో మీ హాజరు కొరకు పై కోర్టు వారు 15-07-2025వ తేదిన వాయిదా వేసి వున్నారు.కావున సదరు తేదిన నీవు స్వయంగా గాని లేక నీ ఉత్తర్వులు పొందిన వకీలు ద్వారా గాని హాజరు అయి ఏవైనా ఆక్షేపణలు వున్నచో నీవు తెలుపకోవలెను. అట్లు తెలుపని ఎడల పై కోర్టు వారు పై అర్జీని నీ పరోక్షమున తీర్మానించుదురు అని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:15/07/2025

స్థలం : కదిరి

ఎన్.సత్యనారాయణ గుప్త, B.Sc, B.L,
పిటీషనర్-వాది తరుపు వకీలు, కదిరి

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) గారి కోర్టు, కదిరి.

O.S. No:99/2021

Between:

జి.శ్రీనివాసులు ...వాది

మరియు

కె.ముస్తఫా ...ప్రతివాది

ప్రతివాది అయినా కె.ముస్తఫా హాజరు కొరకు

కె.ముస్తఫా S/o కె.ఖాసీం వలి, డోర్ నెం.1-152 మెయిన్ రోడ్, కురుమాల గ్రామం, నల్లమాడ్ల మండలం, శ్రీ సత్యసాయి జిల్లా అయిన నీకు ఇందుమూలముగా తెలియజేయడము ఏమనగా పై కోర్టులో నీపైన జి.శ్రీనివాసులు S/o జి.నారాయణప్ప, సంజీవుపల్లి, నల్లమాడ మండలం అను వాదికి రావల్సిన ప్రామిస్సోరీ నోటు బాకీ రాబట్టుటకు పై కోర్టులో దావా దాఖలు చేసినాడు.కావున పై కోర్టులో మీ హాజరు కొరకు పై కోర్టు వారు 15-07-2025వ తేదిన వాయిదా వేసి వున్నారు.కావున సదరు తేదిన నీవు స్వయంగా గాని లేక నీ ఉత్తర్వులు పొందిన వకీలు ద్వారా గాని హాజరు అయి ఏవైనా ఆక్షేపణలు వున్నచో నీవు తెలుపకోవలెను. అట్లు తెలుపని ఎడల పై కోర్టు వారు పై అర్జీని నీ పరోక్షమున తీర్మానించుదురు అని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:15/07/2025

స్థలం : కదిరి

ఎన్.సత్యనారాయణ గుప్త, B.Sc, B.L,
వాది తరుపు వకీలు, కదిరి